
## జమ్మికుంటలో 'లేఖ'ల కలకలం



లేఖ

- 'అయ్యప్ప ఆలయంలో రూ.15కోట్లు స్వాహా...?
- రిజిస్టర్ పోస్టు ద్వారా పలువురికి లేఖలు అందిన వైనం

జమ్మికుంట, ఏప్రిల్ 22: పట్టణంలోని శ్రీఅయ్యప్ప స్వామి దేవాలయం చందాలకు సంబంధించిన నగదును ఆలయ కమిటీగా చెప్పుకొంటున్న పలువురు వ్యక్తులు రూ.15 కోట్లు స్వాహా...? చేశారని.. గుర్తు తెలియని వ్యక్తులు రిజిస్టర్ పోస్టు ద్వారా పంపించిన రెండు పేజీల 'లేఖ'లు స్థానికంగా కలకలం రేపుతున్నది. కొల్లగొట్టిన దేవుడి సొమ్మును రియల్ ఎస్టేట్, ఇతర రాష్ట్రాల్లోని పవిత్ర దేవాలయాల సమీపంలో లాడ్జీలను నిర్మాణం చేసుకున్నారని పోస్టు ద్వారా వచ్చిన లేఖలో పేర్కొనడం చర్చనీయాంశమైంది. జమ్మికుంటలో అన్ని వర్గాల అందించిన సహకారంతో ప్రముఖ రైస్ మిల్లర్ యాంసాని కృష్ణమూర్తి కమిటీ అధ్యక్షుడిగా అయ్యప్ప స్వామి దేవాలయం నిర్మాణం చేశారని, 2000–06 వరకు ఆర్థిక లావాదేవీలు సక్రమంగా జరిగాయని అందులో పేర్కొన్నారు. నాటి అధ్యక్షుడిని ఆలయానికి రాకుండా చేసిన కొందరు కమిటీని తామే ఏర్పాటు చేసుకుని నిర్వహణ బాధ్యతలు చేపట్టారని, ఆలయం కోసం సాయం అందించిన దాతలను, పనిచేసిన గురుస్వాములతోపాటు భక్తులను బెదిరింపులకు గురిచేస్తూ.. 'అయ్యప్ప'కు దూరం చేశారని ఆరోపించారు. ఆలయం కొందరి చేతుల్లోకి వెళ్లిపోయిందని, స్వామి కోసం వచ్చిన సొమ్మును ఇష్టానుసారంగా వాడుకున్నారని అందులో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ఆలయ వార్షికోత్సవం పేరిట రెనోవేషన్ కోసం రూ.16లక్షలు ఖర్చు చేశారని తెలిపారు. స్వామి నిధులు మింగిన, వారికి సహకరించిన ఎవరినీ వదలబోమని అందులో హెచ్చరించారు. ఈ లేఖల నేపథ్యంలో పోలీసులు ఒక్కసారి ఉలిక్కిపడ్డారు. రూ.15కోట్ల స్వాహాపై, గతంలో ఇలాంటి లేఖలు పోస్టులు చేసిన వ్యక్తుల ప్రమేయం, తదితర అంశాలపై ఆరా తీస్తున్నారు. ఇప్పటికే పలువురిని గుర్తించినట్లు తెలిసింది. కేసుల నమోదుకు రంగం సిద్ధమవుతున్నట్లు సమాచారం.

# తెలంగాణ కోసం మరోసారి ఉద్యమిద్దాం



రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు

- రజతోత్సవ సభకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలి
- మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

రామడుగు, ఏప్రిల్ 22 : రాష్ట్ర ప్రజల రక్షణ కోసం మరోసారి ఉద్యమించే సమయం వచ్చిందని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ స్పష్టం చేశారు. రజతోత్సవ సభ విజయవంతంపై రామడుగు మండల కేంద్రంలోని వైశ్యభవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవిశంకర్ మాట్లాడుతూ, ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూది, కేంద్రం మెడలువంచి రాష్ట్రాన్ని సాధించిన మహోన్నతుడు కేసీఆర్ అని కొనియాడారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఆవిర్భవించిన పార్టీ 25వ వసంతంలోకి అడుగిడుతున్న సందర్భంగా ఎల్కతుర్తిలో భారీ సభ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ రజతోత్సవ సభకు ప్రతి ఒక్కరూ కదిలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం వీర్ల వెంకటేశ్వర్రావు మాట్లాడుతూ, ఉద్యమనాయకుడు కేసీఆర్ సారథ్యంలో తెలంగాణకు కాంగ్రెస్ నుంచి విముక్తి కల్పించి, మన ప్రజలను, రైతులను కాపాడుకునే సమయం వచ్చిందన్నారు. అందులో భాగంగా నిర్వహించే రజతోత్సవ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కార్యకర్త, నాయకుడు నడుం కట్టాలని పిలుపునిచ్చారు. అనంతరం రజతోత్సవ సభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రామడుగు మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గంట్ల వెంకటరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తౌటు మురళి, జూపాక కరుణాకర్ పాల్గొన్నారు.

### కార్యకర్తకు బీఆర్ఎస్ నాయకుల పరామర్శ

పందికుంటపల్లి అనుబంధ గ్రామం కుర్మపల్లికి చెందిన దివ్యాంగుడైన బీఆర్ఎస్ కార్యకర్త చిమ్మల్ల శ్రీనివాస్ ఇటీవల పనిమీద కరీంనగర్ వెళ్లి వస్తుండగా, వెంకటగిరి సమీపంలో ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనం ఢీకొనడంతో కుడి కాలు విరిగిపోగా తీవ్రగాయాలయ్యాయి. హాస్పిటల్‌లో చికిత్సపొంది వచ్చిన శ్రీనివాస్‌ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఇక్కడ బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, నాయకులు చిరుత రాంచంద్రం, కొడిమ్యాల రాజేశం, శంకర్, తిరుపతి, బీరేశ్, అంజయ్య, నాగరాజు, తదితరులు ఉన్నారు.

## తిరుపతినాయక్‌ను పరామర్శించిన వినోద్ కుమార్



తిరుపతినాయక్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కార్పొరేషన్/ కొత్తపల్లి, ఏప్రిల్ 22 : కొత్తపల్లి మాజీ మండలపరిషత్ ఉపాధ్యక్షుడు భూక్యా తిరుపతినాయక్‌ను మాజీ ఎంపీ, ప్రణాళిక సంఘం మాజీ ఉపాధ్యక్షుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ మంగళవారం ఆయన స్వగృహంలో పరామర్శించారు. కొద్దిరోజుల క్రితం తిరుపతినాయక్ ప్రమాదవశాత్తు కింద పడి కాలికి గాయం కాగా, హాస్పిటల్‌లో చికిత్స పొంది శాంతినగర్‌లోని తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న వినోద్‌కుమార్, హైదరాబాద్ నుంచి వచ్చి నేరుగా తిరుపతి నాయక్ ఇంటికెళ్లి, ప్రమాదం జరిగిన తీరును తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు జక్కుల నాగరాజు, చాంద్‌పాషా, గుర్రాల జయప్రకాశ్‌రెడ్డి, రేణిగుంట రాజు, రవినాయక్, తిరుపతినాయక్, సలీం, సంపత్, వాజిత్, శశితో పాటు పలువురు ఉన్నారు.

## 30లోగా ఇందిరమ్మ ఇళ్ల ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 22 : ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు చేపడుతున్న నిర్మాణాలపై ఈనెల 30లోగా ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేయాలని, రెవెన్యూ, సమాచార, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. ఇళ్ల నిర్మాణ ప్రగతిపై జిల్లాల కలెక్టర్లతో మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రతి దశలో లబ్ధిదారులకు సహకారం అందించాలన్నారు. ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ, ఫీజులో 25శాతం రాయితీ గడువు పొడిగించే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరముందన్నారు. ఆమోదం పొందిన దరఖాస్తుల ఫీజులు వసూలు చేసి క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సమీక్షా సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, అదనపు కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్, బీఆర్‌వో వెంకటేశ్వర్లు, తదితరులు ఉన్నారు.

## క్రీడా దుస్తుల వితరణ

చిగురుమామిడి, ఏప్రిల్ 22: గునుకుల పల్లె గ్రామంలోని క్రీడాకారులకు మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ చిట్యాల మనోహర్ రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు తిరుమల్ రెడ్డి లక్ష్మీ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గాదె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో గునుకుల పల్లె మాజీ సర్పంచ్ గునుకుల అమూల్య- మధుసూదన్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED

**పాస్ పోర్ట్ పోయినది**
తేది: 18-4-2025 శుక్రవారం రోజున NTPC, మాతంగి కాలనీలోని మా ఇంటి వద్ద నుండి మేడిపల్లి సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క ఒరిజినల్ Passport (No: RA8322423) పోయినది. దొరికిన వారు సంప్ర: M. యశ్విక D/o. M. ప్రణయ్ కుమార్
సెల్: 99125 00330

**పాస్ పోర్ట్ పోయినది**
తేది: 18-4-2025 శుక్రవారం రోజున NTPC, మాతంగి కాలనీలోని మా ఇంటి వద్ద నుండి మేడిపల్లి సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క ఒరిజినల్ Passport (No: PB2187213) పోయినది. దొరికిన వారు సంప్ర: G. జ్యోత్స్న D/o. G. శ్రీనివాస్.
సెల్: 99125 00330

**పాస్ పోర్ట్ పోయినది**
తేది: 18-4-2025 శుక్రవారం రోజున NTPC, మాతంగి కాలనీలోని మా ఇంటి వద్ద నుండి మేడిపల్లి సెంటర్‌కి వెళ్తుండగా మార్గమధ్యంలో నాయొక్క ఒరిజినల్ Passport (No: S5081107) పోయినది. దొరికిన వారు సంప్ర: ప్రణయ్ కుమార్ M, S/o. రవీందర్ M.
సెల్: 99125 00330

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

## 'యశోద'లో అరుదైన వాస్క్యులర్ సర్జరీ



మాట్లాడుతున్న డాక్టర్ డి. ప్రభాకర్

విద్యానగర్, ఏప్రిల్ 22 : సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో అత్యంత అరుదైన వాస్క్యులర్ సర్జరీ నిర్వహించినట్లు హాస్పిటల్ వాస్క్యులర్ సర్జన్ డాక్టర్ డి. ప్రభాకర్ తెలిపారు. మంగళవారం కరీంనగర్ యశోద మెడికల్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని ఎల్కతుర్తికి చెందిన 52 ఏళ్ల కృష్ణమూర్తి ఎడమకాలి వాపు, నడవలేనంత నొప్పి, పాదంలో పుండు వంటి సమస్యలతో తమ వద్దకు వచ్చారని తెలిపారు. వెంటనే సమస్యను గుర్తించి సిటి లోయర్ లింబ్ యాంజియోగ్రఫీ ద్వారా రక్తనాళాలలో అడ్డంకులు (పెరిఫెరల్ ఆర్టరీ డిసీజ్ ) ఏర్పడడం వల్ల రక్తప్రసరణ నిలిచిపోయినట్లు గుర్తించామన్నారు. యశోద హాస్పిటల్ ఉత్తమ వైద్యుల బందం, అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో స్టెంటింగ్, యాంజియోప్లాస్టీ ద్వారా విజయవంతంగా శస్త్రచికిత్స చేసి తిరిగి రక్త ప్రసరణను సాధారణ స్థితికి తీసుకువచ్చామన్నారు. ప్రతి రోజు వాకింగ్, చిన్న చిన్న వ్యాయామం చేస్తే వ్యాధి రాకుండా కొంత మేరకు కాపాడుకోవచ్చన్నారు. కాళ్లలో వాపు, నొప్పి, వేళ్లు మొద్దుబారిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. పేషెంట్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. యశోద హాస్పిటల్‌లో మెరుగైన శస్త్ర చికిత్స అందించడం వల్లే తాను త్వరగా కోలుకున్నానని, వైద్య బందానికి కృతజ్ఞతలు తెలిపారు. విలేకరుల సమావేశంలో హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధురాలికి సామాజిక కార్యకర్త చేయూత

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 22: గత ఐదు రోజులుగా తిండి, తిప్పలు లేకుండా హుజూరాబాద్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో తిరుగుతున్న ఓ వృద్ధ మహిళకు మంగళవారం సామాజిక కార్యకర్త నలుబాల వేణుగోపాల్ చేయూతనందించారు. జమ్మికుంట మండలం మాచినపల్లి గ్రామానికి చెందిన పూలవేని సారమ్మ అనే వృద్ధురాలు జమ్మికుంట రోడ్‌లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో తిరుగుతూ తలదాచుకుంటుంది. ఐదు రోజులుగా తిండి లేక ఉంటున్న ఆ మహిళ దీనస్థితిని గమనించిన వేణుగోపాల్ వెంటనే ఆమెకు భోజనం తినిపించారు. అనంతరం ఐసీడీఎస్ అధికారులకు, పోలీసులకు సమాచారం ఇవ్వగా, హుజూరాబాద్ సీడీపీవో సుగుణ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ, సబిత వచ్చి సారమ్మను కరీంనగర్‌లోని వృద్ధాశ్రమానికి వాహనంలో తరలించారు. కాగా, వృద్ధురాలి దీనస్థితిని గమనించి సాయం అందించిన వేణుగోపాల్‌ను పలువురు అభినందించారు.

## కార్మిక సంఘాల సదస్సును విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఏప్రిల్ 22: నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవనంలో ఈ నెల 25న నిర్వహిస్తున్న కార్మిక సంఘాల సదస్సును విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య పిలుపునిచ్చారు. మే 20న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మె సన్నాహక సమావేశం మంగళవారం గోదాం గడ్డ సివిల్ సప్లయ్ హమాలీలతో నిర్వహించారు. కార్మిక సంఘాల సదస్సుకు అన్ని కార్మిక సంఘాలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో హమాలీ నాయకులు అంజయ్య. శ్రీధర్, కనకయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## చిలుక వాగు ఆక్రమణలపై విచారణ జరుపాలి

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 22: పట్టణ శివారులో రైతులకు నీటి అవసరాలు తీర్చే చిలుక వాగును కొంతమంది వ్యక్తులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, వెంటనే సంబంధిత అధికారులతో సమగ్ర విచారణ జరిపించి వాగును కాపాడాలని బీఆర్ఎస్ నాయకుడు, ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల రెవెన్యూ, సర్వే అధికారులు సర్వే చేసి ఒకవైపు హద్దులు నిర్ణయించగా, తిరిగి గుర్తు తెలియని వ్యక్తులు చిలుక వాగు పరిసర ప్రాంతాల్లో మట్టిని పోసి వాగు స్థలాన్ని ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో విచారణ జరిపి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

## ముగిసిన బీఎస్ఎన్ఎల్ కస్టమర్ సర్వీస్ క్యాంపులు

విద్యానగర్, ఏప్రిల్ 22 : 2025–భారత్ సంచార్ నిగమ్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించిన కస్టమర్ సర్వీస్ క్యాంపులు విజయవంతంగా ముగిశాయి. జిల్లావ్యాప్తంగా టెలిఫోన్ భవన్, కరీంనగర్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, జగిత్యాల, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, హుజూరాబాద్, టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, గోదావరిఖనిలో విశేష స్పందన లభించింది. ఈ క్యాంపుల్లో ఖాతాదారుల ఫిర్యాదులు, బిల్లింగ్ సమస్యలు తదితర అంశాలు అక్కడికక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా డిప్యూటీ జనరల్ మేనేజర్ పొన్నం అజయ్ మాట్లాడుతూ, జిల్లాలో వివిధ ప్రాంతాల్లో నెట్ వర్క్ పరిధి మెరుగుపర్చేందుకు కొత్త బీటీఎస్‌లు, టవర్లు ప్రతిపాదించినట్లు తెలిపారు.

## భూసార పరీక్షలపై అవగాహన

కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 22: జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ డిగ్రీ కళాశాల రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఎరిస్ ఆగ్రో లిమిటెడ్ సహకారంతో భూసార పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తగా హాజరైన పూర్ణచందర్ మాట్లాడుతూ, విద్యార్థులను ఇంటర్న్‌షిప్ కార్యక్రమం ద్వారా ఎంపిక చేసుకొని, భూసార పరిరక్షణపై రైతుల్లో అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి. నితిన్, రసాయన శాస్త్ర విభాగాధిపతి మేజర్ రేళ్ల సంజీవ్, అధ్యాపకులు శ్రీనివాస్, మునీందర్ రెడ్డి, ఉపన్యాసకులు టీ కరుణాకర్, ఏ శంకరయ్య, పి. రాజేశ్, డాక్టర్ కే సునీత, గోపి విద్యార్థులు పాల్గొన్నారు.

## హోంగార్డులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 22: హోంగార్డులకు నిబంధనల మేరకు విధులు కేటాయిస్తూ ఉద్యోగ భద్రత కల్పించేలా చట్ట సవరణ చేయాలని, తెలంగాణ పోలీస్ శాఖ హోంగార్డుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం నగరంలోని ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడుతున్న అనేక మంది హోంగార్డులు కోలుకున్న అనంతరం కూడా విధులు నిర్వహించలేక, తమ కుటుంబాలను పోషించలేని దైన్య స్థితిని ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీరితో పాటు విధి నిర్వహణలో మరణించిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు అమలు చేసేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. అతి తక్కువ వేతనంతో ఎక్కువ సమయం విధులు నిర్వహిస్తున్న హోంగార్డులను ఆదుకోవాలని ఇప్పటికే కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్‌ని కూడా కలిసి వినతిపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు. సమావేశంలో హోంగార్డుల సంక్షేమ సంఘం జిల్లా ప్రతినిధులు కిరణ్, పవన్, సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల అధ్యక్షులు, మరణించిన హోంగార్డుల కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## చెక్‌డ్యాంలో జారిపడి యువకుడి మృతి

వీణవంక, ఏప్రిల్ 22: మండల కేంద్రానికి చెందిన ధార క్రాంతిరాజ్ (19) అనే యువకుడు ప్రమాదవశాత్తు చెక్‌డ్యాంలో జారిపడి మృతిచెందాడు. ఎస్ఐ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ధార క్రాంతిరాజ్ ఈ నెల 21న సాయంత్రం బయటకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు వెతుకుతుండగా వీణవంక చెక్‌డ్యాంలో శవమై కనిపించాడు. కాలకృత్యాలకు వెళ్లిన క్రాంతిరాజ్ ప్రమాదవశాత్తు కాలుజారి చెక్‌డ్యాంలో పడగా, ఈత రాకపోవడంతో నీటిలో మునిగి చనిపోయాడు. మృతుడి తల్లి ధార స్వప్న ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## కారు ఢీకొని డ్రైవర్..

తిమ్మాపూర్, ఏప్రిల్ 22: కారు అతి వేగం డీసీఎం వ్యాన్ డ్రైవర్ ప్రాణాలు తీసింది. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాల్వశ్రీరాంపూర్‌కు చెందిన దొప్ప సంతోష్ కుమార్ (32) డీసీఎం వ్యాన్ డ్రైవర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో మేడ్చల్ జిల్లా నూతనకల్ గ్రామంలో మక్క కంకులు అన్‌లోడ్ చేసి తిరిగి వస్తుండగా మండలంలోని కొత్తపల్లి గ్రామ శివారులో తన వ్యానును రోడ్డు పక్కన ఆపుకొని, స్నేహితుల కోసం వేచి చూస్తున్నాడు. ఈ క్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి రోడ్డు పక్కన నిల్చుని ఉన్న సంతోష్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అతడి భార్య స్రవంతి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్ఎండీ ఎస్ఐ వివేక్ తెలిపారు.

## గ్రంథాలయానికి పుస్తకాల బహూకరణ

కొత్తపల్లి, ఏప్రిల్ 22 : జిల్లాకేంద్రంలోని శ్రీపురం కాలనీకి చెందిన గోవర్ధన అముక్త మాల్యద అనే ఉపాధ్యాయిని పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు జిల్లాకేంద్ర గ్రంథాలయానికి మంగళవారం అందజేశారు. మొత్తం రూ.19,987 విలువ గల 262 పుస్తకాలు, కాటలాగ్‌ను అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్ చేతుల మీదుగా జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశంకు అందజేశారు. ఈసందర్భంగా పలువురు ఆమెను అభినందించారు. భగత్‌నగర్‌లో గల సిద్ధార్థ ఉన్నత పాఠశాలలో మాల్యద విధులు నిర్వహిస్తున్నారు.

## కలెక్టర్ సుడిగాలి పర్యటన

రామడుగు, ఏప్రిల్ 22: మండలంలో మంగళవారం కలెక్టర్ పమేలా సత్పతి సుడిగాలి పర్యటన చేశారు. దేశరాజ్‌పల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. వాతావరణం సరిగాలేదని, కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఆదేశించారు. మండల కేంద్రంలోని భవిత కేంద్రాన్ని సందర్శించారు. దివ్యాంగ విద్యార్థులతో ముచ్చటించారు. భవిత కేంద్రాలకు వాటి పరిధిలోని వీవోలు సేవలందించాలన్నారు. దేశరాజ్‌పల్లి అనుబంధ గ్రామం ఔదార్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య మహిళా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణతో కలిసి కలెక్టర్ సందర్శించారు. మహిళలతో మాట్లాడారు. ఆరోగ్య మహిళా వైద్యశిబిరంలో మహిళలందరికీ అన్ని రకాల స్క్రీనింగ్ పరీక్షలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇక్కడ తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, పీవోఎంహెచ్ఎన్ జవేరియా, వైద్యాధికారులు రమేశ్, భాగ్యశ్రీ, తదితరులు ఉన్నారు.

## ఎస్ఈతో ఫోన్ ఇన్‌కు 23 ఫిర్యాదులు

ముకరంపుర, ఏప్రిల్ 22: ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ సమస్యలపై మంగళవారం నిర్వహించిన ఫోన్ ఇన్ కార్యక్రమానికి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వినియోగదారులు తమ సమస్యలను తెలియజేశారు. ఫోన్ ఇన్ లో వినియోగదారుల నుంచి అధికారులు మొత్తం 23 కాల్స్ స్వీకరించారు. ఇందులో బిల్లు, లైన్ షిఫ్టింగ్, పేరు మార్పు, వోల్టేజీ హెచ్చుతగ్గులు, సబ్ స్టేషన్ ఏర్పాటు, ఇతర విద్యుత్ సమస్యలను వివరించారని ఎస్ఈ మేక రమేశ్ బాబు తెలిపారు. కార్యక్రమంలో డీఈలు కే ఉపేందర్, జె రాజం, ఎం తిరుపతి, ఎస్ఏవో రాజేంద్ర ప్రసాద్, ఏడీఈలు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ

కలెక్టరేట్, ఏప్రిల్ 22: జిల్లాలోని గ్రామపంచాయతీల కార్యదర్శులకు పలు కార్యక్రమాల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం మంగళవారం మొదలైంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ భాగస్వామ్యంతో కలెక్టరేట్‌లోని మర్రిచెన్నారెడ్డి మానవవనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రారంభించిన ఈ శిక్షణలో తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం, 2018ప్రకారం గ్రామ సభ పాత్ర, మెరుగైన స్థానిక పాలన కోసం ప్రజల భాగస్వామ్యం, సమాచార హక్కు చట్టం, స్వచ్ఛందంగా సమాచారం వెల్లడిస్తూ పారదర్శకతను ప్రోత్సహించడం లాంటి అంశాలపై కార్యదర్శులకు రెండు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి రోజు శిక్షణలో జిల్లాలోని వివిధ పంచాయతీలకు చెందిన 35 మంది కార్యదర్శులు పాల్గొన్నారు.

# ఇంటర్‌లో విద్యార్థుల ప్రతిభ

ఉత్తమ మార్కులతో సత్తా • అభినందించిన ప్రిన్సిపాల్స్

తిమ్మాపూర్ రూరల్, ఏప్రిల్ 22: అలుగునూరులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభ కేంద్రం విద్యార్థినులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. సెకండ్ ఇయర్ బైపీసీలో టి.రాజ్యలక్ష్మి, డి.సంధ్య 991 మార్కులు, ఎంపీసీలో ఏ శరణ్య 991 మార్కులు సాధించగా, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో విద్యార్థులు బి.అక్షిత, బి.నితీష, కే. సౌమ్య, ఎం. భవిత, ఎస్. నందిని 467 మార్కులు, ఆర్.శివాని 466 మార్కులు, బైపీసీలో జె ప్రసన్న, ఆర్.శ్రీనిజ 436 మార్కులు, జి. శ్రీనివాస్, ఎం. ప్రేమ్ కుమార్ 434 మార్కులు సాధించారని ప్రధానాచార్యులు కే .శ్రీనివాస్ రెడ్డి వెల్లడించారు.

శంకరపట్నం, ఏప్రిల్ 22: ఇంటర్ మీడియట్ ఫలితాల్లో మండల కేంద్రానికి చెందిన కేజీబీవీ విద్యార్థిని పీ స్వాతి ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 464 మార్కులు, ఎంపీసీ సెకండ్ ఇయర్ ఫలితాల్లో కె. హాసిని 960 మార్కులు సాధించగా, బీపీసీలో కె. శరణ్య 428 మార్కులు సాధించి సత్తా చాటినట్లు ఎస్‌వో మాధవి తెలిపారు. అలాగే, మోడల్ స్కూల్‌లో ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో బుర్ర వర్షిణి 463 మార్కులు, సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో మేహెక్ 459 మార్కులు, ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో నాబా మొహమ్మద్ 982 మార్కులు, బీపీసీ సెకండ్ ఇయర్‌లో రాణవేని శ్రుతి శరణ్య 969 మార్కులు, సీఈసీ సెకండ్ ఇయర్‌లో ఇమ్రాన్ 864 మార్కులు సాధించి ఇంటర్ ఫలితాల్లో టాపర్‌లుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ సరిత వెల్లడించారు.

కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 22: మొగ్దుంపూర్‌లోని మైనారిటీ గురుకుల బాలుర కళాశాలలో ఈటీ సెకండ్ ఇయర్‌లో చరణ్ తేజ 993 మార్కులు, ఎంఎల్‌టీలో మొదటి సంవత్సరంలో మహమ్మద్ రెహమాన్ 493 మార్కులు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమోహన్ తెలిపారు. మొదటి సంవత్సరంలో 36 మంది విద్యార్థులు 400కు పైగా మార్కులు, రెండో సంవత్సరంలో 16 మంది విద్యార్థులు 900కు పైగా మార్కులు సాధించారని చెప్పారు.

మానకొండూర్, ఏప్రిల్ 22: మండలంలోని పోచంపల్లి ఆదర్శ కళాశాలలో పీ అంజలి సీఈసీ మొదటి సంవత్సరంలో 492, బైపీసీ ఫస్ట్ ఇయర్‌లో బీ రక్షిత 434 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో సత్తాచాటారు. ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో సీహెచ్ అశ్విత 448 మార్కులు సాధించింది. సెకండ్ ఇయర్ ఎంపీసీలో బి స్పందన 941, బైపీసీలో ఎం అఖిల 859, సీఈసీలో మహాలక్ష్మి 780 మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మశ్రీ తెలిపారు. మానకొండూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో టేకు సరిత 929, బైపీసీలో సుమయ 928, ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీలో ఊరడి వరుణ్‌సాయి 461, ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఎల్ పవిత్ర 482 మార్కులు సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు అభినందించారు.

హుజూరాబాద్ టౌన్, ఏప్రిల్ 22: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి కే అభిరామ్ ఎంపీసీ ఫస్ట్ ఇయర్‌లో 463 మార్కులు, బైపీసీలో జే మాధవి 370, సీఈసీలో పీ అర్చన 388, హెచ్ఐసీలో టీ అఖిల 400 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో కె సిరి చందన 879, బైపీసీలో ఎం.రామ్ చరణ్ 928 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ వి ఆంజనేయ రావు అభినందించారు.

చొప్పదండి, ఏప్రిల్ 22: రుక్మాపూర్ ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థి జె.సంతోష్ 983, ఎంపీసీ ఫస్టియర్‌లో ఎం వైష్ణవి 460 మార్కులు సాధించారు. చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ సెకండ్ ఇయర్‌లో టి.విష్ణువర్ధన్ 979, ఫస్ట్ ఇయర్‌లో గర్షకుర్తి శ్రీజ 401 మార్కులు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్స్ సుధాకర్, శరత్ బాబు అభినందించారు.

## ‘భూ భారతి’పై రైతులకు అవగాహన

రామడుగు, ఏప్రిల్22: రామడుగు షానగర్ శ్రీలక్ష్మి గార్డెన్స్‌లో మంగళవారం భూభారతి కొత్త ఆర్‌వోఆర్ చట్టంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ, భూభారతి ద్వారా భూమికి సంబంధించిన సమస్యలు జిల్లా స్థాయిలోనే సత్వరం పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ, భూభారతి చట్టం దేశానికే దిక్సూచిలా నిలువనుందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీకిరణ్, ఆర్డీవో మహేశ్వర్, మండల ప్రత్యేకాధికారి కిషన్ ప్రకాశ్, ఏడీఏ ప్రియదర్శిని, తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రాజేశ్వరి, కొక్కెరకుంట విండో చైర్మన్ వొంటెల మురళీకృష్ణారెడ్డి, గోపాల్‌రావుపేట ఏఎంసీ చైర్‌పర్సన్ బొమ్మరవేణి తిరుమల, ఆర్పీ ప్రేమ్‌చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మానకొండూర్, ఏప్రిల్ 22: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతుధర పొందాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. మండలంలోని గంగిపల్లి, కొండపల్కల గ్రామాల్లో సింగిల్‌విండో, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మర్రి ఓదెలు, వైస్ చైర్మన్ రామిడి తిరుమల్‌రెడ్డి, మానకొండూర్ సింగిల్‌విండో చైర్మన్ నల్ల గోవిందరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నందగిరి రవి, సింగిల్‌విండో డైరెక్టర్లు, నాయకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే నాణ్యమైన బోధన

మానకొండూర్, ఏప్రిల్ 22: ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని, విద్యార్థులు ప్రయివేట్‌కు దీటుగా మెరుగైన ఫలితాలు సాధిస్తున్నారని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. మంగళవారం దేవంపల్లి గురుకుల పాఠశాల/ కళాశాలలో జరిగిన కార్యక్రమానికి ఆయన హాజరై ఇటీవల వెలువడిన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు సాధించిన కళాశాల విద్యార్థి ఎస్ అనురాగ్‌ను, అదేవిదంగా మెయిన్స్‌లో క్వాలిఫై అయిన 12 మంది విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించి వారిని శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోలి జగన్నాథం, వైస్ ప్రిన్సిపాల్ ఆది కొమురయ్య, పాఠశాల పేరెంట్ కమిటీ చైర్మన్ రేణికుంట బాబు, నాయకులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా వార్షికోత్సవం



గోపాల్‌రావుపేట ఉన్నత పాఠశాల వార్షికోత్సవంలో నృత్యం చేస్తున్న చిన్నారులు

రామడుగు, ఏప్రిల్22 : మండలంలోని గోపాల్‌రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పాఠశాల వార్షికోత్సవ వేడుకలను విద్యార్థులు ఘనంగా జరుపుకొన్నారు. ఈ సందర్భంగా హాజరైన మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో వార్షికోత్సవాలు జరుపుకోవడం హర్షణీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం చేకూరుతుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో చిన్నారుల నృత్యాలు ఆహూతులను అలరించాయి. అనంతరం ఉన్నత పాఠశాల సామాన్యశాస్త్ర ఉపాధ్యాయుడు దేవేందర్ రెడ్డి ఉద్యోగ విరమణ కార్యక్రమంలో పాల్గొని దేవేందర్‌రెడ్డి, సుకన్య దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని శైలజ, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ప్రశాంత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక హక్కులు గుర్తు చేసేందుకే పౌరసేవల దినోత్సవం

కలెక్టరేట్, ఏప్రిల్ 22 : ప్రజల ప్రాథమిక హక్కులను గుర్తు చేసే క్రమంలోనే జాతీయ స్థాయిలో ఏటా పౌరసేవల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు, ప్రజాస్వామ్య పరిరక్షణ వేదిక జిల్లా కన్వీనర్ వేల్పూరి శ్రీనివాస్ తెలిపారు. ఈనెల 21న పౌరసేవల దినోత్సవాన్ని పురస్కరించుకుని, మంగళవారం నగరంలోని కోతిరాంపూర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు మెరుగైన సేవలందించాలని, తద్వారా వారి ప్రాథమిక హక్కులను ప్రజలు సద్వినియోగం చేసుకునేందుకు సహకరించినవారవుతారని అన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు ఇంతియాజ్, ఎండి.షుకూర్, ఎంఏ.గఫార్, రజినీకాంత్, వంగల వెంకటేశ్వర్లు, తైదల అంజయ్య, చిన్నకోడూరు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

## మోడల్‌స్కూల్ విద్యార్థికి మొదటిర్యాంకు



భోగ శ్రీజ

రామడుగు, ఏప్రిల్ 22: ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ విద్యార్థిని సత్తాచాటింది. సీఈసీ ఫస్ట్ ఇయర్‌లో భోగ శ్రీజ 494 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంకు కైవసం చేసుకున్నది. మండలంలోని మోతె గ్రామానికి చెందిన శ్రీజది పేద కుటుంబం. తండ్రి వీరేశం ఊరూరా తిరిగి బట్టలు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తుండగా, తల్లి గృహిణి. కాగా, శ్రీజ రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకు సాధించడంపై ఉపాధ్యాయులు అభినందించగా, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. కాగా, ఎంపీసీలో పుట్ట హాసిని 448, బైపీసీలో జ్యోతి 389 మార్కులు సాధించారు. రెండో సంవత్సరం ఎంపీసీలో మహేశ్వరి 934, బైపీసీలో శ్రీవిద్య 897, సీఈసీలో కార్తీక్ 955 మార్కులు సాధించారు. రాష్ట్రస్థాయిలో మంచి మార్కులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ ఆడెపు మనోజ్ కుమార్ అభినందించారు.

## జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విద్యార్థుల సత్తా

చొప్పదండి, ఏప్రిల్ 22: జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాల్లో రుక్మాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల సైనిక్ పాఠశాల/కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినట్లు కళాశాల డైరెక్టర్ కర్నల్ కేసీరావు, ప్రిన్సిపాల్ కాళహస్తి తెలిపారు. కళాశాలలో మొత్తం 48 మంది విద్యార్థులు మెయిన్స్ ఎంట్రెన్స్ పరీక్ష రాయగా, తొమ్మిది మంది జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులను కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్‌తో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.